ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్ జిల్లా వార్తలు
5
బుధవారం 6 మార్చి 2024

కేసీఆర్ సభపై బీఆర్ఎస్ ఆశలు

పూర్వవైభవానికి నేతల తహతహ.. లక్ష మంది సమీకరణకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయాన్ని చవిచూసిన బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా పూర్వవైభవాన్ని సంతరించుకోవాలని చూస్తున్నది. తెలంగాణ ఉద్యమకాలంలో, తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రభుత్వ ఏర్పాటులో ప్రతి సందర్భంలోనూ బీఆర్ఎస్‌కు, దాని అధినేత కేసీఆర్‌కు వెన్నంటి ఉంటూ సెంటిమెంట్‌గా మారిన



ఉమ్మడిజిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా పైచేయి సాధించాలని ఆ పార్టీ నాయకులు, శ్రేణులు భావిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి కేసీఆర్ కరీంనగర్ నుంచే శ్రీకారం చుట్టాలని నిర్ణయించడంతో అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● సభ తర్వాత రోడ్‌షోలు

ఈనెల 12న కరీంనగర్‌లో జరుగనున్న కరీంనగర్ కదనభేరి సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించి సింహగర్జన సభ నాటి రోజులను పునరావృతం చేయాలని, తద్వారా బీఆర్ఎస్ ప్రాభవాన్ని మళ్లీ చాటాలని వారు భావిస్తున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ కరీంనగర్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను, పెద్దపల్లి అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించారు. వీరిద్దరు తమ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇప్పటికే నాయకులను, శ్రేణులను కలుస్తూ వారిని ఎన్నికల దిశగా సమాయత్తం చేస్తున్నారు. కదనభేరి సభతో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి ఆ తర్వాత ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల్లో సభలు, రోడ్ షోలు నిర్వహించాలని వాటిలో కేసీఆర్ పాల్గొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. కదనభేరి సభలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి లక్షకు తగ్గకుండా ప్రజలను సమావేశానికి హాజరయ్యేలా చూడాలని లక్ష్యంగా పెట్టుకుని అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, శాసనసభ్యుడు, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను చూస్తున్నారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, హుజూరాబాద్, సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.నాలుగు నియోజకవర్గాలైన చొప్పదండి, మానకొండూర్, హుస్నాబాద్, వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచినా ఆయా పార్టీలకు వచ్చిన ఓట్లను పరిగణలోకి తీసుకుంటే ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్‌కే ఐదు వేల పైచిలుకు ఓట్లు ఎక్కువ వచ్చాయి. ఐదు వేల ఓట్ల ఆధిక్యాన్ని పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదని భావించిన అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీతో సమాన ఓట్లను సాధించామని పార్లమెంట్ ఎన్ని కల్లో మరింతసత్తాచూపి విజయాన్నిసాధించాలని బీఆర్ఎస్ భావిస్తున్నది.

● సత్తా చాటాలని తహతహ

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో తమకు ముక్కోణపు పోటీ జరుగనున్న నేపథ్యంలో కష్టపడితే విజయం సాధించవచ్చని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీపై దేశంలో ఉన్న సానుకూలత ప్రస్తుతం పెద్దగా లేదని వారు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికీ రైతుబంధు నిధులు పూర్తిస్థాయిలో రైతుల ఖాతాల్లో జమకాక పోవడం, రుణమాఫీ పథకం అమలుకు నోచుకోక పోవడం, మహిళలకు 2,500 రూపాయల సాయం అందించే పథకం ప్రారంభించక పోవడం తమకు కలిసివస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నామమాత్రపు పోటీకే పరిమితమైన నేపథ్యంలో బీజేపీ ఆ పార్టీ ఓట్లను చీల్చుకుని విజయం సాధించిందని, ఇప్పుడు ముక్కోణపు పోటీ తమకు కలిసి వస్తుందని బీఆర్ఎస్ నేతలు అంచనా వేస్తున్నారు. కరీంనగర్‌లో విజయం సాధించడం ద్వారా మళ్లీ ఈ జిల్లాను బీఆర్ఎస్ కంచుకోటగా మార్చవచ్చని అనుకుంటున్నారు. కేసీఆర్ పాల్గొననున్న కదనబేరి సభ ఇందుకు తోడ్పడుతుందని వారు ధీమాగా ఉన్నారు. స్థానిక నేతల తీరుపై కోపాన్ని ప్రదర్శించిన ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లు వేశారని అయితే కేసీఆర్ అధికారంలో లేక పోవడాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. ప్రజల్లో ఉన్న ఈ భావనే వారిని బీఆర్ఎస్‌కు మళ్లీ ఓట్లు వేసేలా చేస్తుందని భావిస్తున్నారు.

కదనభేరి సభను విజయవంతం చేయాలి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే 'గంగుల',


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి గంగుల కమలాకర్, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్, మార్చి 5: కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో ఈనెల 12న నిర్వహించతలపెట్టిన కరీంనగర్ కదనభేరి సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. మంగళవారం సాయంత్రం ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ కేసీఆర్‌కు కరీంనగర్ ప్రజలతో ఎంతో అనుబంధం ఉందని, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు కేసీఆర్ కరీంనగర్ సింహగర్జన బహిరంగ సభతో శంఖారావం పూరించారని అన్నారు. ఇదే ఎస్సారార్ కళాశాల మైదానంలోనే సింహగర్జన ప్రారంభించామని, ఉమ్మడి జిల్లా హుజూరాబాద్‌లో రైతుబంధు, దళిత బంధు పథకాలను ప్రారంభించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మూడు నెలల్లోనే ప్రజలకు విసుగు వచ్చిందని అన్నారు. తెలంగాణ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ అధినేతగా ఉండాలని తెలంగాణ ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు. లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోని ప్రజలు పెద్ద ఎత్తున ప్రజలు కదన భేరి బహిరంగ సభకు హాజరవుతున్నారన్నారు. రైతులకు ఇప్పుడే నీటి కష్టాలు మొదలవుతున్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి తీరుతామని వినోద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలోని లోటుపాట్లను సవరించాం

కలెక్టర్ పమేలా సత్పతి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కరీంనగర్ టౌన్, మార్చి 5: కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని ఓటరు జాబితాలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి లోటుపాట్లను సర్వేచేసి పకడ్బందీగా సవరించామని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళ వారం కలెక్టరేట్ సమావేశమందిరంలో అధికారులతో ఓటరుజాబితాపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ పరిధిలో బీఎల్‌వోలు ఓటరు జాబితాపె సర్వే చేశారని అన్నారు. రెండు చోట్ల ఉన్న ఓట్లు, మృతి చెందిన వారి ఓట్లను తొలగించామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం డిప్యూటీ సీఈవో హరిసింగ్, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మికిరణ్, ఆర్డీవో కె మహేశ్వర్,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్,తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

● దివ్యాంగులు ఆర్థికంగా ఎదగాలి

దివ్యాంగులు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ పథకం కింద యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తోట సుజాత అనే దివ్యాంగురాలికి అందించిన జిరాక్స్ మిషన్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. మెప్మా ఆధ్వర్యంలో ఆదర్శ సంఘంలో సభ్యురాలిగా సుజాత కొనసాగుతున్నారు. లక్ష రూపాయల విలువ చేసే జిరాక్స్ మిషన్‌ను ఆమెకు బ్యాంకు అందించింది. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, మెప్మా పీడీ రవీందర్, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ అపర్ణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలన కేంద్రాలు సమర్థవంతంగా పనిచేయాలి

కరీంనగర్ టౌన్, మార్చి 5: ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పొప్పులను సవరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎనర్జీ సెక్రెటరీ, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండి రిజ్వీ, సివిల్ సప్లయిస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ అధికారులకు సూచించారు. మంగళవారం హైదరాబాద్ చీఫ్ సెక్రెటరీ కార్యాలయం నుంచి కలెక్టర్లతో ప్రజాపాలన సేవా కేంద్రాల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిజ్వీ, చౌహాన్ మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల సవరణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరుగవద్దని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ సబ్సిడీ, గృహలక్ష్మి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికి పథకాల అమలులో ప్రాధాన్యం ఇవ్వాలని, సేవా కేంద్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. మీటర్ నంబర్ సరిగా లేకుంటే మరోసారి చెక్ చేసుకొని సరిచేయాలని సూచించారు. అధికారులంతా బాధ్యతయుతంగా పనిచేయాలని, అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో రవీందర్ పాల్గొన్నారు.

రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

కరీంనగర్ టౌన్, మార్చి 5: జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 7న ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు జడ్పీ సీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కరీంనగర్‌కు కేంద్ర పారామిలటరీ బలగాలు

● సీఐఎస్ఎఫ్ అధికారులతో సమావేశమైన సీపీ


అంబేద్కర్ స్టేడియంలో సీఐఎస్ఎఫ్ అధికారులతో సమావేశమైన సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, మార్చి 5: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బందోబస్తు కోసం కేంద్ర పారా మిలటరీ బల గాలు (సీఐఎస్ఎఫ్) మంగళవారం కరీంనగర్‌కు చేరుకున్నా యి. ఈ బలగాలకు అంబేద్కర్ స్టేడియంలో వసతి కల్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ స్టేడియంలో సీఐఎస్ ఎఫ్ బలగాల అధికారులతో సీపీ అభిషేక్ మొహంతి సమా వేశమయ్యారు. ఎన్నికల సమయంలో కేంద్ర పారా మిలటరీ బలగాలు నిర్వహించాల్సిన విధులు, స్థానిక పరిస్థితులు, ఎదురయ్యే సవాళ్లపై చర్చించారు. ఏవైనా సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ కమాండర్ విక్రాంత్ షాక్కిన్, సూపర్‌వైజరీ ఆఫీసర్ విజేందర్, ఏసీపీలు శ్రీనివాస్ (హుజూ రాబాద్), ప్రతాప్ (ఏఆర్), సీఐ సరిలాల్ పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

● జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ

కరీంనగర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బాలల హక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలల పరిరక్షణ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల రక్షణ చట్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాల న్నారు. బాల్య వివాహాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమా వేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, చొప్పదండి ఎంపీపీ చిలుక రవీందర్, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధి కారి సరస్వతి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, కార్మిక శాఖ కమిషనర్ శ్యాముల్‌జాన్, డీసీపీవో శాంత పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేశ్

గణేశ్‌నగర్, మార్చి 5: విద్యార్థులు, మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేశ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్సారార్ కళాశాల బాలికల వసతి గృహంలో చట్టాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహహింస నిరోధక చట్టం, పనిచేసే ప్రదేశాలలో మహిళలకు రక్షణ చట్టం, మహిళలకు సంబంధించిన ఇతర చట్టాల గురించి వివరించారు. చక్కగా చదువుకొని క్రమశిక్షణతో ఎంచుకున్న లక్ష్యలను సాధించడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ తణుకు మహేష్, వసతి గృహం నిర్వాహకురాలు రేవ పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతి కోసం బీజేపీ ప్రభుత్వం కృషి


బీజేపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు శోభారెడ్డి

భగత్‌నగర్, మార్చి 5: దేశంలో మహిళల అభ్యున్నతి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు, శక్తివందన్ స్టేట్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శోభారెడ్డి అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శక్తివందన్ ప్రోగ్రాం సన్నాహక సమావేశం పార్లమెంట్ అసెంబ్లీ కన్వీనర్లతో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. శక్తి వందన్ కార్యక్రమం ద్వారా మహిళలకు మరింత చేరువ కావడానికి బీజేపీ శ్రేణులు కృషిచేయాలన్నారు. బుధవారం ప్రధాని మోదీ శక్తి వందన్ కార్యక్రమంలో భాగంగా వీవో, సీఆర్పీ, స్వయం సహాయక బృందాల సభ్యులను ఉద్దేశించి మాట్లాడే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని వీక్షించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, అసెంబ్లీ కన్వీనర్లు దుబాల శ్రీనివాస్, జగన్‌రెడ్డి, శ్రవణ్, గౌతంరెడ్డి, పుప్పాల రఘు, కారండ్ల మధు, రాగి సత్యనారాయణ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

జమ్మికుంట, మార్చి 5: జమ్మికుంట రైల్వే స్టేషన్లో ఓ వృద్ధుడు (65) పట్టాలు దాటుతుండగా అయోధ్య స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తిం పు కార్డులు లభించలేదు. మృతుడు తెలుపు రంగు ఫుల్‌షర్ట్, దానిపై నలుపు లైట్‌బ్రౌన్ రంగు నిలువు గీతల డిజైన్, నీలి రంగు గీతల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చు రీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కె ట్‌కు 71మంది రైతులు 687క్వింటాళ్ల విడిపత్తి, ఐదుగురు రైతులు క్వింటా ళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహి రంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు

సిరిసిల్ల క్రైం, మార్చి 5: దొంగతనం చేసిన వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు 200 రూపాయల జరిమానా విధిస్తూ ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ సృజన మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట్ మండలం సింగారం గ్రామానికి చెందిన ఘనగోని బంటి షాప్‌లో సెప్టెంబర్ 2, 2023న రాత్రి 10 గంటల సమయంలో దొంగతనం జరిగింది. షాప్‌లో క్యాష్ కౌంటర్‌ను ఓపెన్ చేసి అందులో ఉన్న రూ. 3,500 దొంగతనం చేసారని బాధితులు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నేరస్తుడిని పట్టుకొని కోర్టుకి తరలించారు. కోర్టులో నేరస్థుడు అయిన రామేండ్ల సుధీర్ దొంగతనం చేసానని ఒప్పుకున్నందున న్యాయమూర్తి ఒక ఏడాది సంవత్సరం జైలు శిక్ష , రూ.3,500 జరిమానా విధించినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య


విద్యశ్రీ (ఫైల్)

చందుర్తి, మార్చి 5: రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మూడపల్లి అనుబంధ గ్రామమైన గొస్కులపల్లికి చెందిన ముదాం విద్యశ్రీ హైదరాబాద్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గొస్కులపల్లి గ్రామానికి చెందిన విద్యశ్రీ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పని చేస్తోంది. ఆరు నెలల క్రితం వరకు వర్క్ ఫ్రం హోం విధులు నిర్వహించింది. అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ విధులకు హాజరవుతోంది. వేములవాడ చెందిన ఓ యువకుడితో ఈ నెల 17న వివాహం జరగాల్సి ఉంది. సోమవారం మధ్యాహ్నం హాస్టల్‌లోని బాత్‌రూంలో ఉరేసుకుంది. గమనించిన హాస్టల్ యాజమాన్యం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

వీణవంక, మార్చి5: వేతనాలు చెల్లించాలని మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందించారు. వేతనాలు సరైన సమయానికి రాకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోందన్నారు. వేసవి దృష్ట్యా సమయాన్ని కుదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు కండే సదయ్య, కిషన్‌రావు, దాసారపు వెంకటేశ్, మహంకాళి కొంరయ్య, శంకర్, మల్లయ్య, లక్ష్మి, నిజాముద్దీన్, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో మహాశివరాత్రికి ఏర్పాట్లు


వేములవాడలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ టౌన్, మార్చి 5: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు రాజన్న క్షేత్రం ముస్తాబైంది. రాజన్న ఆలయంలో మూడు రోజులపాటు మహాశివరాత్రి జాతరను అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రంగా ఏర్పట్లు సిద్ధం చేస్తుంది. మహాశివరాత్రి జాతరకు సుమారుగా నాలుగు లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం వున్నట్లు అధికారులు అంచానా వేస్తున్నారు. వేములవాడ ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పట్టణాన్ని సర్వంగ సుందరంగా సిద్దం చేశారు. వేములవాడలోకి ప్రవేశించే మార్గాలను కమాన్‌ల వద్ద స్వాగత తోరణాలను భక్తులకు స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేశారు. నందికమాన్ చౌరస్తాతో పాటు మూలవాగు బ్రిడ్జిపై రంగురంగుల విద్యుత్ దీపాలతో భక్తులను మంత్ర ముగ్దులు చేసేలా ఏర్పాట్లను చేశారు. రాజన్న ఆలయం విద్యుత్‌దీపాలతో వెలుగులు జిమ్ముతుంది. ఆలయ గర్భగుడి, మహామండపంతో పాటు ఆలయంలోకి ప్రవేశించి మార్గాల్లో రంగు రంగు పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఇతర రాష్ట్రాల నుంచి రానున్న భక్తులు

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్, మహారాష్ట్ర ప్రాంతాల వారు ఎక్కువ సంఖ్యలో రానున్నట్లు తెలుస్తుంది. దేవాలయానికి వచ్చే భక్తులు జాగం ముట్టించి మొక్కులు అప్పగించేందుకు వీలుగా భక్తులకు ఇబ్బందులు తలేత్తకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఈవో కృష్ణప్రసాద్‌లు ఎప్పటికప్పుడు ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. దేవాలయ పరిసరాల్లో 850 సీసీ కెమెరాలను, కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సెంటర్‌కు అనుసందానం చేసి 24 గంటలు పోలీసుల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు చేపట్టారు. మహాశివరాత్రి జాతర ఏర్పాట్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసర సేవలు అందిచేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాతర జరిగే ప్రాంతాల్లో, బస్టాండు సమీపంలో వైద్యకేంద్రాలను ఏర్పాటు చేసి 104, 108 వాహనాలను ఆలయ పరిసరాల్లో అందుబాటులో చర్యలు చేపట్టారు.

రాజన్న హుండీ ఆదాయం ఒక కోటి 14 లక్షలు

వేములవాడ టౌన్: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఆలయ అధికారులు, సిబ్బంది కలిసి హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ. ఒక కోటి 14 లక్షల 2 వేయిల 466 నగదు సమకూరగా 124 గ్రాముల 500 మిల్లి గ్రాముల బంగారం, 7 కిలోల 500 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. హుండీ లెక్కింపును ఈవో కృష్ణప్రసాద్, కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఏసి చంద్రశేఖర్, పర్యవేక్షకులు ఏఈవో హరి కిషన్, జయకుమారి, ప్రతాప నవీన్ తదితరులు పర్యవేక్షించారు.

విద్యానిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి5 : విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహిస్తున్న అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నాతనియల్ తెలిపారు. విద్యార్థులకు 20 లక్షల రూపాయల స్కాలర్‌షిప్ అందించుటకు నిర్ణయించారన్నారు. యూఎస్‌ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, సౌత్‌కొరియా, న్యూజిలాండ్ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలగు ప్రొఫెషనల్ కోర్సుల్లో చదివేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు కరీంనగర్ జిల్లాకు చెందిన ఎస్సీ కులమునకు చెందినవారై ఉండాలన్నారు. సంవత్సర ఆదాయం 5 లక్షలకు మించకుండా ఉండాలన్నారు. గ్రాడ్యుయేషన్‌లో 60శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చి ఉండాలన్నారు. వీసా అర్హత కలిగి, విదేశీ విశ్వ విద్యాలయము నందు అడ్మిషన్ పొంది ఉండాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి తెలిపారు.

గ్రూప్స్ ఉచిత శిక్షణ దరఖాస్తులకు తుది గడువు నేడు

గణేశ్‌నగర్, మార్చి 3: కరీంనగర్‌లోని రాష్ట్ర షెడ్యుల్డ్ కులాల స్టడీ సర్కిల్‌లో (అంబేడ్కర్ స్టడీ సర్కిల్) గ్రూప్ 1,2,3,4, బ్యాంకింగ్, రైల్వే, స్టాఫ్ సెలక్షన్, ఇతర పోటీ పరీక్షలకు 5 నెలల ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుకు బుధవారం తుది గడువని ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా డైరెక్టర్ బండ శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న కరీంనగర్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికైన 100 మందికి ఉచిత భోజన, వసతులతో పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తారు.

8న ఎమ్మార్పీఎస్ సదస్సు

సుభాష్‌నగర్, మార్చి 5: ఎమ్మార్పీఎస్ కరీంనగర్ నియోజకవర్గ సదస్సును ఈ నెల 8న నిర్వహిస్తున్నామని, ఈ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని కార్ఖానగడ్డలో ఎమ్మార్పీఎస్ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా కొమ్ముల రమేశ్, ప్రధాన కార్యదర్శి దండు రమేశ్, ఉపాధ్యక్షుడిగా గాలి అరుణ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి దండు అంజయ్య, కనకం అంజిబాబు, నీర్ల కుమారస్వామి, మా రంపెల్లి మల్లేశం, గసికంటి వెంకన్న, చిలుక శ్రీనివాస్, విజయకుమార్, కొమ్ముల సాయికృష్ణ, కొమ్ముల రాజమల్లు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి రిమాండ్

రుద్రంగి మార్చి 5: రుద్రంగి మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన జమీర్ అనే యువకుడు ఎల్లమ్మ ఆలయ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి వద్ద400గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఇద్దరికి శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 5: విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు పట్టుబడిన కేసులో ఇద్దరు నిందితులకు జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి జైలు శిక్ష లేదా జరిమానా చెల్లించాలని తీర్పు వెలువరించిందని ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ శ్రీలక్ష్మి తెలిపారు. జమ్మికుంట మండలం నాగారం గ్రామానికి చెందిన కప్పంపల్లి రవి, వావిలాల గ్రామానికి చెందిన ఉర సంపత్‌లకు 9,597 రూపాయలు, 5,914 రూపాయల వంతున జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

విశ్వకర్మ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, మార్చి 5: విశ్వకర్మ ఇండస్ట్రియల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివపురి రాజేశం కోరారు. మంగళవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విశ్వకర్మల పాత్ర కీలకమన్నారు. గత ప్రభుత్వ హయాంలో విశ్వకర్మల బతుకులు బాగుపడతాయని ఆశించి భంగపడ్డామన్నారు. తమ సమస్యలు తెలుపుదామంటే వినే నాయకుడే కరువయ్యాడని వాపోయారు. తమ వృత్తులకు ఆటంకం కలిగించే విధంగా అటవీశాఖ తీసుకువచ్చిన జీవోతో తమను కేసీఆర్ రోడ్డుపాలు చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి బీసీ కులగణన చేస్తామని తీర్మానం ఆమోదించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విశ్వకర్మల పక్షాన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 7న నగరంలోని ఇందిరా గార్డెన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని విశ్వకర్మలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నపుడే తమకు అనేక సంక్షేమ అందాయన్నారు. 2008లో వైఎస్‌ఆర్ ఉన్నపుడు జీవో 85 ద్వారా ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఫెడరేషన్ ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల వేణుగోపాలచారి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గర్రెపల్లి నారాయణ స్వామి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చింతల రాజేశ్వర్, పూసాల నారాయణస్వామి, ఊకంటి ఓంకార్, చెల్పూరి జయ, జిల్లా మహిళ అధ్యక్షురాలు పోలోజు అంజలిదేవి, సావనపల్లి లక్ష్మి, పోలోజు లక్ష్మి, పోలోజు అంజమ్మ, పోలోజు విక్రమ్, గర్రపల్లి రాజేశం పాల్గొన్నారు.

ధర్మపురిలో బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

● కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

ధర్మపురి, మార్చి 5: ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో మార్చి 20 నుంచి ఏప్రిల్ 1 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. స్థానిక టీటీడీ ధర్మశాల ఆవరణలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన బ్రహ్మోత్సవాల సమన్వయ సమావేశానికి డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జగిత్యాల డీఎస్పీ రఘునందన్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్యమ్మ, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు చేపట్టాల్సిన వసతుల ఏర్పాట్ల గురించి చర్చించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరు కానున్న దృష్ట్యా ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవాభావంతో పనిచేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం అదనంగా కార్మికులను నియమించి ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరణ చేసి క్షేత్రంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు. ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాల సందర్భంగా అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రయాణికుల సంఖ్యను బట్టి అదనంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలన్నారు. గోదావరి నది, దేవాలయం, బస్‌స్టేషన్, మున్సిపల్ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాన్స్‌కో డీఈఈ రాజరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ మురళి, మిషన్ భగీరథ డిఈఈ రాహుల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఈఈ నరసింహమూర్తిని వారి వారి విధులు సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ డీఎం సుమతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, సీఐ రాంనర్సిం హరెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఆర్యవైశ్య సంఘం నేత జక్కు రవీందర్ అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఇల్లు కూల్చేందుకు అధికారుల యత్నం

● అడ్డుకున్న కుటుంబ సభ్యులు


అయిలయ్య ఇంటి వద్ద అధికారులు, పోలీసులు

శంకరపట్నం, మార్చి 5: గ్రామపంచాయతీ అనుమతి లేదని ఇంటిని కూల్చేందుకు అధికారులు సిబ్బందితో కలిసి రాగా కుటుంబీకులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. కరీంపేట గ్రామానికి చెందిన అంకతి రాజయ్య కుటుంబ సభ్యులు రేకుల షెడ్డు నిర్మించుకున్నారు. ఆ ఇంటిలో రాజయ్య మేన అల్లుడు వనపర్తి అయిలయ్య కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. డీపీవో ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ మంగళవారం ఇంటి నిర్మాణం తొలగించుటకు అక్కడికి వెళ్లారు. ఇంటిలో నివాసం ఉన్న అయిలయ్య కుటుంబ సభ్యులు, వారి బంధు వులు ఆందోళనకు దిగారు. ఆత్మహత్య చేసుకుంటానని అయిలయ్య మందు డబ్బాతో బెదరించాడు. అధికారులు నాలుగు రోజుల గడువు ఇచ్చి వెనుదిరిగారు.

భార్యను హత్య చేసిన వ్యక్తి అరెస్టు


పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ క్రిష్ణ

పాలకుర్తి, మార్చి 5 : బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ గ్రామంలో సోమవారం భార్యను హత్య చేసిన కొమురయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ తెలిపారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. రంగాపూర్ గ్రామానికి చెందిన కలవేన కొమురయ్య అనే సింగరేణి ఉద్యోగి తన భార్య కౌసల్య(43)ను గొడ్డలితో నరికి హత్య చేశాడన్నారు. కొమురయ్యను అరెస్టు చేయటంతో పాటు హత్యకు ఉపయోగించి గొడ్డలిని, మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కొమురయ్య, కౌసల్య మధ్య కొంత కాలంగా మనస్పర్థలు వచ్చి గొడవలు జరుగుతున్నాయని, కొమురయ్యకు రంగాపూర్‌లో వివాహేతర సంబంధం ఉన్నదని మృతురాలికి అనుమానం ఉండేదని,ఆ విషయమై ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవన్నారు. గోదావరిఖనిలో ఉద్యోగం చేస్తున్న కొమురయ్య రంగాపూర్‌లో వ్యవసాయం చేస్తున్నాడని, కొమురయ్య రంగాపూర్‌లోనే ఉందామని అనగా మృతురాలు ఒప్పుకోలేదని, దీంతో భార్యను తప్పిస్తే తాను ప్రశాంతంగా ఉండొచ్చనే ఆలోచనతో గోదావరిఖని నుంచి ఇంటి సామానును తీసుకరావడానికి వెళ్లగా అక్కడ ఇద్దరి మధ్య గొడవ జరిగిందన్నారు. అప్పటినుంచి కక్ష పెంచుకున్న కొమురయ్య సోమవారం మధ్యాహ్నం నిద్రిస్తున్న కౌసల్యను గొడ్డలితో నరికి చంపాడన్నారు. గొడ్డలిని గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్‌పీ కెనాల్‌లో పడేసి తన ద్విచక్ర వాహనంపై వెళ్లి రాత్రి అక్కడే ఉండి మంగళవారం గోదావరిఖనికి వెళ్తుండగా అందుగులపల్లి గ్రామ శివారులో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని 24 గంటలలోపు అరెస్టు చేసినందుకు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామిని, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

ఈ పాత్రికేయుల సమావేశంలో పెద్దపల్లి సీఐ ఆర్ క్రిష్ణ, ఎస్ఐలు ఆర్ స్వామి, శివాణిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లోన్ పేరుతో మోసం

● మెట్‌పల్లిలో యువకుడికి ఇబ్బందులు

మెట్‌పల్లి, మార్చి 5: మెట్‌పల్లి పట్టణానికి చెందిన రాంపల్లి శ్యామ్‌కుమార్ అనే ఓ ప్రైవేటు ఉద్యోగి లోన్ యాప్‌తో మోసపోయాడు. విషయం తెలియడంతో మంగళవాం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపల్లి శ్యామ్‌కుమార్ ఫిబ్రవరి 15న హైదరాబాద్‌లోని కొత్తపేట పెట్రోల్ బంకు సమీపంలోని ఎస్‌బీఐ లోగోతో ఉన్న క్రెడిట్ కార్యాలయంలోకి వెళ్లాడు. క్రెడిట్ కార్డు కావాలని అక్కడ ఉన్న వారిని అడగా ఆయన సిబిల్ స్కోర్ పరిశీలించి నీకు రాదని తెలిపారు. నీకు కావాలంటే క్రెడిట్ బీ అనే లోన్ యాప్ ద్వారా తీసుకుంటే సిబిల్ స్కోర్ పెరుగుతుందని యాప్ డౌన్‌లోడ్ చేశారు. ఆన్‌లైన్ ద్వారా రూ. 3వేలు అకౌంట్‌కు జమ చేయించారు. అనంతరం దానిని తిరిగి చెల్లించాడు. మళ్లీ ఈ నెల 3న మార్ఫింగ్ చేసిన ఫొటోలు ఆయన వాట్సాప్‌కు వివిధ ఫోన్ నంబర్ల ద్వారా పంపుతూ భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో భయపడి వారు తెలిపిన యూపీఐడీ నంబర్లకు మొత్తం రూ. 32వేలు పంపించాడు. అంతే కాకుండా ఆయన ఫోన్ ప్రమేయం లేకుండా ఆటోమేటిక్‌గా మెసేజ్‌లు వెళ్లాయి. దీంతో మోసపోయానని గమనించిన శ్యామ్‌కుమార్ మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మెట్‌పల్లి రూరల్, మార్చి 5: మండలంలోని కేసీఆర్ తండాకు చెందిన గూగ్లావత్ లక్ష్మి(31) అను వివాహిత గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తుల వేధింపులకు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మిని అదే గ్రామానికి చెందిన గూగ్లవత్ భాస్కర్ కొన్ని రోజుల నుంచి వెంటపడి వేధించాడు. దీంతో లక్ష్మి ఇటీవల పోలీసుస్టేషన్‌లో భాస్కర్‌పై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని మనసులో పెట్టుకున్న భాస్కర్ లక్ష్మిపై కోపం పెంచుకున్నాడు. మంగళవారం ఉదయం లక్ష్మి పొలం పనుల కోసం ఇంటి నుంచి బయలు దేరింది. మార్గ మధ్యలో భాస్కర్, గూగ్లవత్ సురేష్, గూగ్లవత్ వసంత అను ముగ్గురు తిడుతూ ఆమెపై చేయి చేసుకున్నారు. మనస్థాపానికి గురైన లక్ష్మి ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని ఇంట్లో ఉన్న అత్తమామలకు తెలిపింది. కాసేపటికి ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొంత సమయం తరువాత కుటుంబ సభ్యులు చూసి భర్తకు సమచారం అందించగా ఇంటికి వచ్చి చూసేసరికి చనిపోయింది. మృతురాలి భర్త గూగ్లవత్ మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి నాలుగేళ్లలో తొమ్మిది ఉద్యోగాలు


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ

ఇల్లంతకుంట, మార్చి 5: మండలంలోని కిష్టరావుపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి లంబాడి శ్రీనివాస్ ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో గురుకుల పాఠశాల జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. నాలుగేళ్లలో తొమ్మిది ఉద్యోగాలు సాధించి సత్తా చాటిన సందర్భంగా మంగళవారం శ్రీనివాస్‌ను సన్మానించారు. మెదక్ జిల్లా హవేలిఘన్పూర్ మండలం పరీద్‌పూర్ తండాకు చెందిన శ్రీనివాస్ ఇప్పటి వరకు ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్, కో ఆపరేటీవ్‌లో అసిస్టెంట్ మేనేజర్, పంచాయతీ కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్‌సప్లైలో జూనియర్ అసిస్టెంట్, ఎఫ్‌సీఐలో జూనియర్ అసిస్టెంట్, బీఎస్‌ఎన్‌ఎల్‌లో జేఏవో, మున్సిపాలటీలో సీనియర్ అకౌంటెంట్, గురుకుల పాఠశాలలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు పొందాడు. ప్రజలకు సేవచేయాలనే లక్ష్యంతో ఇంతకాలం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి పంచాయతీ కార్యదర్శిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాస తిరుపతి, ఎలుక స్వామి, అల్లెపు రజనీకాంత్, మామిడి రాజు, బిగుల్ల విజయ్, న్యాత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 363 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 5: ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ పరీక్షలకు 363 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మంగళవారం సెకండ్ ఇయర్ మ్యాథమెటిక్స్ బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలకు 15,738 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 363 గైర్హాజరు కాగా 15,375 హాజరయ్యారు. జనరల్ విభాగంలో 14,225 మందికిగాను 299 మంది గైర్హాజరు కాగా 13,926 మంది, ఒకేషనల్ విభాగంలో 1513 మంది విద్యార్థులకు 64 మంది పరీక్షలకు హాజరుకాలేదని, 1449 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టామని, పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్స్, డిపార్టుమెంటల్ అధికారులతోపాటు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాయని చెప్పారు.

సెయింట్ జార్జ్ (సీబీఎస్ఈ) పాఠశాలలో జిమ్ ప్రారంభం



జిమ్‌ను ప్రారంభిస్తున్న సెయింట్‌జార్జ్ చైర్మన్ ఫాతిమారెడ్డి, ఎస్‌ఐ సురేష్

కరీంనగర్ రూరల్, మార్చి5: కొత్తపల్లిలోని సెయింట్‌జార్జ్ (సీబీఎస్ఈ) ఇంటర్నేషనల్ పాఠశాలలో మంగళవారం జిమ్‌ను పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి, కమిషనరేట్ ఎస్‌ఐ ఎంసురేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ ఫాతిమారెడ్డి మాట్లాడుతూ మనిషికి ఫిట్‌నెస్ చాలా అవసరమని, ఫిట్‌గా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. విద్యార్థులతో పాటు, అధ్యాపక బృందం ఫిట్‌నెస్‌పై దృష్టి సారించడానికి జిమ్ ప్రారంభించామన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ

కరీంనగర్ టౌన్, మార్చి 5: నగరంలోని స్వధార్ హోంలోని నిరాశ్రయులకు భగత్‌నగర్‌లోని రావూస్ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో సేకరించిన డబ్బులతో దుప్పట్లను కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు విద్యార్థులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని, విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగిన ప్రోత్సాహాన్ని అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల సీఈవో నితిన్‌రావు, ప్రిన్సిపాల్ రహ్మాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మున్సిపల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం

కరీంనగర్ రూరల్, మార్చి 5: కొత్తపల్లి మున్సిపాలిటీ బడ్జెట్ ప్రత్యేక సమావేశం మంగళవారం మున్సిపాల్‌కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ రుద్ర రాజు అధ్యక్షతన జరిగింది. 2023-24 సంవత్సరానికి సవరణ అంచనా ఆదాయం రూ.586.96 లక్షలు కాగా సవరణ అంచనా వ్యయం 581.08 లక్షలు. 31-03-2024 నాటికి వ్యయంపై ఆదాయ అంచనా మిగులు 5.88 లక్షలు ఉన్నాయి. 2024-2025 సంవత్సరానికి మొత్తం అంచనా ఆదాయం 589.68 లక్షలు కాగా, అంచనా వ్యయాన్ని 581.37 లక్షలుగా నిర్ణయించారు. 31-03-2025 నాటికి సాధారణ నిధులు, అంచనా వ్యయంపై అంచనా ఆదాయం మిగులు 8.31 లక్షలు ఉండే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సిహెచ్‌రమేష్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్‌సభ్యులు పాల్గొన్నారు.

తృణముల్ కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

గణేశ్‌నగర్, మార్చి 5: సందేశ్ కాళీ సంఘటన నిందితులను ఉరి తీసి బాధితులకు న్యాయం చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ ఎదుట మంగళవారం టీఎంసీ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ రాకేష్ మాట్లాడుతూ సందేశాఖాలీ ప్రాంతంలోని పలువురు మహిళలు జిహాదీ గ్రూపు ద్వారా లైంగిక దోపిడీకి గురవుతున్నారన్నారు. నిరసన కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అంజన్న, స్టేట్ లా ఫోరం కో కన్వీనర్ ప్రమోద్, నగర కార్యదర్శి నందు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ మధు,జిల్లా హాస్టల్స్ ఇంచార్జ్ శ్రీ వర్ధన్, నాగరాజు, నగర ఉపాధ్యక్షులు సాయి కృష్ణ,నవీన్, ఉదయ్, నగర సంయుక్త కార్యదర్శులు అరుణ్, అనిల్, పవన్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

కరంనగర్‌రూరల్, మార్చి 5: కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని రైతువేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగుయాజమాన్యం, వరిలో చీడపీడల తెగుళ్ల పోషక లోపాలపై రైతులకు అవగాహనకల్పించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.సత్యం, ఆత్మ బీటీఎం శ్రీలత, రమ్య, ఏఈఓ జఫరుల్లా తదితరులు పాల్గొన్నారు.

95శాతం పల్స్ పోలియో పూర్తి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు

హుజూరాబాద్, మార్చి 5: ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల పిల్లల వరకు 95శాతం పల్స్ పోలియో చుక్కలు వేశామని హుజూరాబాద్ డిప్యూటీ డీఎం హెచ్‌వో చందు అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లో పల్స్ పోలియో కేంద్రాలను పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ మిగితా రెండ్రోజుల్లో 5శాతం కూడా పూర్తి చేస్తామన్నారు. పల్స్ పోలియో కోసం 185 కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇందులో 800మంది ఆరోగ్య సిబ్బంది పనిచేశారన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాజీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందించిన ఎమ్మెల్యే

తిమ్మాపూర్, మార్చి5: మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండి కాలనీలో గల మానకొండూర్ నియోజకవర్గ కార్యాలయంలో తిమ్మాపూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, ఎంపిటిసిలు కొత్త తిరుపతిరెడ్డి, రమేష్, తహసీల్దార్ కనకయ్య, ఆర్ఐ అక్బర్ తదితరులు ఉన్నారు.

ఎండుతున్న పంటల కోసం నీటి విడుదల

రామడుగు, మార్చి 5: పంటల కోసం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి ఎండుతున్న పంటల కోసం అధికా రులు నీటిని విడుదల చేశారు. సోమవారం రాత్రి ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం, ఇంజనీరింగ్ అధికారులు గ్రావిటీ కెనాల్‌కు ఒక పంపు ద్వారా 3150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పంటలు ఎండిపోతుండటంతో రైతు లు స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు.ఆయన ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక



హైమావతి

జమ్మికుంట, మార్చి 5: జమ్మికుంట పట్టణానికి చెందిన నాగవెల్లి హైమావతి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ప్రశంసలు అందుకుంటోంది. 2015 సంవత్సరంలో హైమావతికి జమ్మికుంటకు చెందిన నాగవెల్లి అనిల్‌తో వివాహం జరిగింది. భర్త ప్రోత్సాహంతో కెమిస్ట్రీలో జూనియర్ లెక్చరర్, పిజిటిలో ఫిజికల్ సైన్స్, టీజీటీ ఉద్యోగాలకు ఎంపికైంది. జూనియర్ లెక్చరర్‌గా నియామకం అయినట్లు హైమావతి తెలిపింది.

బదిలీ అయిన ఉద్యోగులను డిప్యుటేషన్‌పై పంపించాలి

హుజూరాబాద్, మార్చి 5: 317 జీవో ద్వారా బదిలీ అయిన వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులను తిరిగి డిప్యూటేషన్‌పై పంపించాలని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం వాణిజ్య పన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ సునీతకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 317 జీవోపై కమిటీ వేసిందని, దానిని పూర్తి చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు.

అనారోగ్యంతో బీజేపీ సీనియర్ నాయకుడు మృతి

● సంతాపం తెలిపిన ఈటల, బండి సంజయ్



ప్రవీణ్ (ఫైల్)

హుజూరాబాద్, మార్చి 5: హుజూరాబాద్ గాంధీనగర్‌కు చెందిన ఏబీవీపీ, బీజేపీ జిల్లా కార్యదర్శి మాడ్గుల ప్రవీణ్ (32) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కొన్ని రోజులుగా ప్రవీణ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రవీణ్ మృతికి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, మజీ మంత్రి ఈటల రాజేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సంతాపం వ్యక్తం చేశారు.

'మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు'



మాట్లాడుతున్న సంక్షేమ అధికారి సరస్వతి

కరీంనగర్ కల్చరల్, మార్చి 5: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి అన్నారు. నగరంలోని అశోక్‌నగర్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవాన్ని వాసవి వనితా హంగామా పేరుతో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ మహిళల్లో మరింత చైతన్యాన్ని నింపేందుకు ఇలాంటి వేడుకలు తోడ్పడుతాయని అన్నారు. మహిళలు తమ హక్కులు, చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రచయిత్రులు రేగులపాటి విజయలక్ష్మి, డాక్టర్ అడువాల సుజాత, గాయని బి రేవతి, కార్పొరేటర్ వంగల శ్రీదేవి, విద్యావేత్త గంజి సుజాత, యోగా గురువు అలకానందలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చందా విజయలక్ష్మి, నూనె పద్మావతి, కోశాధికారి పడకంటి అనూరాధ, రీజనల్ చైర్ పర్సన్ ఏ నాగరాజు, రవీందర్, అర్చన, మాధవి తదితరులు పాల్గొన్నారు.

●భగత్‌నగర్, మార్చి5: నగరంలోని అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి సుజాతరెడ్డి ఆధ్వర్యంలో మహిళలను ఘనంగా సన్మానించారు. జిల్లాపరిషత్ హాల్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ప్రస్తుతం అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. వివిధ రంగాల్లో కృషి చేసినమహిళలు శారద, పూజ, సరోజన సింగు విజయ, రాధిక, లక్ష్మి, స్వప్నలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోగూరి సుమరెడ్డి, సునీత, లాస్య, అక్షయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి కార్పొరేటర్లను సస్పెండ్ చేయాలి'

కరీంనగర్ టౌన్, మార్చి 5: భూకబ్జాలు, ఇతర అవినీతి ఆరోపణలు వచ్చిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, పార్టీ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని 49వ డివిజన్ ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్ కమల్‌జిత్ కౌర్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావును కోరారు. ఈమేరకు మంగళవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. గతంలో నాకు, నా భర్తకు వాయిస్ రికార్డు ఆధారంగా షోకాజు నోటీసు ఇచ్చారని, అప్పుడు తాము సమాధానమిచ్చామని అన్నారు. ఇప్పుడు పలువురు బీఆర్ఎస్‌నాయకులు, కార్పొరేటర్లపై అవినీతి, భూకబ్జా ఆరోపణలు వచ్చినప్పటికి వారికి ఎందుకు పార్టీ నుంచి నోటీసు ఇవ్వలేదని ప్రశ్నించారు. వెంటనే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్పొరేటర్లు, నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆమె కోరారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

కరీంనగర్ రూరల్, మార్చి 5: పేద విద్యార్థికి కళాశాల ఫీజును హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ సంస్థ ఆర్థిక సాయంగా అందించింది. కొత్తపల్లికి చెందిన శ్రావణి డిఫార్మసి చేయడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో సంస్థ కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి చింతల శ్రీనివాస్ ద్వారా మంగళవారం కళాశాలలో 38వేల రూపాయల ఫీజును చెల్లించారు. ప్రతి సంవత్సరం చదువుకు ఆటంకం లేకుండా ఫీజులుచెల్లిస్తామని సంస్థ ప్రతినిధులుతెలిపారు. ఈకార్యక్రమంలో ఎర్రోళ్ల ప్రదీప్, చిట్కూరు శ్రీనివాస్, రాజమౌళి పాల్గొన్నారు.

రేపు మంత్రి పొన్నంకు సన్మానం

గణేశ్‌నగర్, మార్చి 5: మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఈనెల7న ఆత్మీయ సన్మానం నిర్వహిస్తున్నామని, దీన్ని విజయవంతం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి గడప కోటేశ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కదారి అయిలన్న మంగళవారం పిలుపునిచ్చారు. బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరీంనగర్ ఇందిరా గార్డెన్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

గౌడ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

కరీంనగర్ రూరల్, మార్చి 5: మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మాన కార్యక్రమంతో పాటు, గౌడ సమ్మేళనాన్ని ఈనెల 10న నిర్వహిస్తామని, దీన్ని విజయవంతం చేయాలని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో గీత కార్మికులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో బుర్ర హరీష్‌గౌడ్, భూమయ్య, కొయ్యడ సంపత్, న్యాలం కనుకయ్య, భూసారపు లక్ష్మణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

కరీంనగర్ రూరల్, మార్చి 5: ఉమ్మడి కరీంనగర్ జిల్లా గౌడ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన ఆహ్వాన పత్రికను కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఈనెల 10వ తేదీన సన్మాన కార్యక్రమ ఆహ్వాన పత్రికను రూపొందించి గౌడ సంఘాల సభ్యులకు అందించారు. బొమ్మకల్‌లోని వి కన్వెన్షన్ హాలులో మధ్యాహ్నం 12గంటలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని గౌడ కులస్థులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కొత్తపల్లి ఎంపీపీ శ్రీలతమహేష్, మాజీ సుడా డైరెక్టర్, ఎలగందల్ ఎంపీటీసీ మందరమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్లపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, మార్చి 5: ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రంజాన్ మాసంను పురస్కరించుకుని పండుగ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ పట్టణంతో పాటు జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 16 మండలాలలోని మజీద్‌ల వద్ద శానిటేషన్, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, ఈద్గాలు, ఖబ్రస్తాన్‌లను శుభ్రం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రంజాన్ మాసంలో నమాజ్ సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వారిలో యువజన కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహమాన్, లయాక్ ఖాద్రి, ఖాజా ఖాన్, జమీల్ అహ్మద్, మహమ్మద్ అమీర్ తదితరులు ఉన్నారు.

పబ్లిక్ బోర్‌వెల్‌ను తొలగించిన వారిపై చర్య తీసుకోవాలి

కరీంనగర్ టౌన్, మార్చి 5: నగరంలోని 47వ డివిజన్ షాషా మోహల్లాలోని ఇంటినెంబర్ 1-2-100, 1-2-100/ఎ ముందు గతంలో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పబ్లిక్ బోర్‌వెల్‌ను రాత్రికి రాత్రి తొలగించి పేదలకు నీరు లేకుండా చేశారని ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తికి లాభం చేసేందుకు పేద ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ బోర్‌వెల్‌ను తొలగించడమే కాకుండా ఆ బోర్‌వెల్ సామాగ్రిని బల్దియా స్టోర్స్‌కు తరలించకుండా అమ్ముకున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వీటిపై విచారణ జరిపి బాధ్యులైన బల్దియా ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, పేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

'ఎన్నికల హామీలను నెరవేర్చాలి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ టౌన్, మార్చి 5: కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పాలన వల్లనే దేశం, రాష్ట్రం అధోగతి పాలైందని ఆయన ఆరోపించారు. మంగళవారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీసేవలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్లు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్‌తో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిందని అన్నారు. ఆదిలాబాద్‌లో ప్రధాని మోదీ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్, బీజేపీల వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని బీఆర్ఎస్‌శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కుర్ర సూర్యశేఖర్, కులదీప్‌వర్మ, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేస్తాం : కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

చొప్పదండి, మార్చి5: చొప్పదండి పట్టణంలోని జిల్లా ప్రజాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం చొప్పదండి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల పనులను పూర్తి చేయిస్తామని, సైన్స్ ల్యాబ్‌తోపాటు మరో రెండు అదనపు తరగతి గదులను నిర్మిస్తామని అన్నారు. ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి శుద్ధిచేసిన తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, వైస్ ఎంపీపీ విజయలక్ష్మి, తహసీల్దార్ నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగం శ్రీనివాస్,ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

రామడుగు బ్రిడ్జిని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే మేడిపల్లి

రామడుగు : మండల కేంద్రంలో నిర్మిస్తున్న బ్రిడ్జిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం పరిశీలించారు. ఐదు సంవత్సరాల క్రితం రూ.7 కోట్ల 90 లక్షలతో ప్రారంభించిన బ్రిడ్జి నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో మండల ప్రజల నుంచి వినతులు అందాయి.. దీనితో కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి బ్రిడ్జిని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నరెడ్డి, చొప్పదండి మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్‌రావు, ఎంపీడీవో రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు స్వయం శక్తి సాధించాలి

వీణవంక, మార్చి5: విద్యార్థులు స్వయం శక్తి సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు అన్నారు. మంగళవారం ఘన్ముక్ల ఆదర్శ పాఠశాలలో గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ క్లబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమములో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌డా.వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●మానకొండూర్: గ్రామస్థుల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు అన్నారు. మండలంలోని అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి సర్వేతో పాటు సీసీ కెమెరాలు, శుద్ధజల నీటి సౌకర్యాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి బొద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి విరాళంగా సీసీ కెమెరాలు, పాకాల పురుషోత్తంరెడ్డి, రామగిరి సారయ్య, రేగుల రవీందర్ విద్యార్థులకు శుద్ధజల తాగునీరు అందించేందుకు 200 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ఫిల్టర్‌ను విరాళంగా అందజేయడం సంతోషదాయకమన్నారు. కిచెన్‌షెడ్డు, తరగతి అదనపు గదులు, విద్యార్థులకు ఫర్నిచర్ అందజేసిన పాకాల క్రిష్ణారెడ్డిని డీఈవో అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, మాజీ సర్పంచు బొట్ల కిషన్, ఉపసర్పంచు మూగల మహేందర్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేస్తాం : కవ్వంపల్లి



ముత్తారంలో యాదవ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

శంకరపట్నం, మార్చి 5: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ అన్నారు. మంగళవారం మం డలంలోని ముత్తారం గ్రామంలో యాదవ సంఘం భవనాన్ని, గద్దపాకలో కబ్రాస్థాన్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకు స్థాపన చేశారు. అలాగే గద్దపాకలో గృహ జ్యోతి పథకం కింద అర్హులకు జీరో విద్యు త్ బిల్లులు జారీ చేశారు. అనంతరం గద్దపాకలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, నాయకులు పాల్గొన్నారు.

● రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కార్యకర్తలకు ఉద్బోధించారు. శంకరపట్నంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

● గన్నేరువరం: తనను భుజాలపై మోసి ఎమ్మెల్యేగా గెలింపించేందుకు కృషి చేసిన కార్యకర్తలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం గన్నేరువరంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలనిపిలుపునిచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ స్టేట్ జాయింట్ సెక్రటరీ అల్లూరి శ్రీరాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలి

సైదాపూర్, మార్చి 5: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ గడ్డపై గులాబీ జెండా ఎగరాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం సైదాపూర్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం ఐదు రూపాయలు కూడా నిధులు తీసుకురాలేదని విమర్శించారు. కరీంనగర్ పట్టణాన్ని స్మార్ట్ సిటీ జాబితాలో చేర్పించి కేంద్రం నుంచి తాను వెయ్యి కోట్ల నిధులు తీసుకొచ్చానన్నారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులపై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వొడి తెల సతీష్‌కుమార్, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ గోపాల్‌రావు, ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, సోమారపు రాజయ్య పాల్గొన్నారు.

● చిగురుమామిడి: సీఎం రేవంత్‌రెడ్డి మరో ఏక్‌నాథ్ షిండే లాగా కాబోతున్నారని బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సుందరగిరిలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మామిడి అంజయ్య అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం నీళ్ల రైతులకు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తోందని అన్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌కు చేసింది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్, ఎంపిపి వినీత-కొత్త శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపిపి బేతి రాజిరెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్‌జంగ వెంకటరమణారెడ్డి, చెప్యాల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో ట్రాలీ యూనియన్ అధ్యక్షుడిగా లక్ష్మణ్



గణేశ్‌నగర్, మార్చి 5: నగరంలోని ఆటో ట్రాలీ యూని యన్ గాంధీ రోడ్ అడ్డా నంబర్-4 అధ్యక్షుడిగా ఎలకల పల్లి లక్ష్మణ్ మంగళవారం రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అనిశెట్టి సురేష్, ప్రధాన కార్యదర్శిగా నలపాల సురేష్ యాదవ్, క్యాషియర్‌గా నర్మేట శ్రీనివాస్‌ను, సభ్యులుగా కూకట్ల కనకయ్య, ఆసంపల్లి ఎల్లయ్య, డాంరాజ్ అంజనేయులు, సంపత్, కనకరాజు, రాయమల్లు, రాజకుమార్ అనిల్‌ను ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ రెండోసారి తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న శ్రీ హనుమాన్ ఆటో ట్రాలీ యూనియన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎంపీ బండి సంజయ్‌పై ఫిర్యాదు

కరీంనగర్ అర్బన్, మార్చి 5: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఇటీవల రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఏఐసీసీ మీడియా సభ్యులు డాక్టర్ గిరిజా షెట్కర్ మంగళవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ సునీతా లక్ష్మారెడ్డికి, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాలకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుని ఇటువంటి వాఖ్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. మహిళల పట్ల అవమానకరంగా వ్యాఖ్యలు చేయటం క్షమించరానిదని, రాజకీయ నాయకులు చర్చలు, డిబేట్‌లలో హుందాగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మహిళల గౌరవం కాపాడాలని అన్నారు.

కొండయ్యగౌడ్ మృతికి మంత్రి పొన్నం సంతాపం

కరీంనగర్ అర్బన్, మార్చి 5: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంఘం జనహక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర కొండయ్య గౌడ్ ఆకస్మిక మరణం పట్ల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బుర్ర కొండయ్య గీత కార్మికుల హక్కుల కోసం పోరాటం చేశారని, ఆయన సేవలు మరువ లేనివన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మార్చి 5: నగరంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. కమాన్ ఫీడర్ పరిధిలో గాయత్రినగర్, లక్ష్మీనగర్, షాషామహల్, మధు గార్డెన్ ఏరియా, కోతిరాంపూర్, పోచమ్మ వాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన ఈసందర్భంగా కోరారు.

నాగదేవత ప్రతిష్ఠ

కరీంనగర్‌రూరల్, మార్చి 5: కొత్తపల్లి మండలంలోని చింతకుంట ప్రగతినగర్‌లో హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో నాగదేవత ప్రతిష్ఠాపన కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్, అర్చకులు వంశీకృష్ణచారి, దేవసాని విజేతహనుమంతరెడ్డి, కంకణాల అనిల్‌కుమార్, శ్రీనివాస్, మాధవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీనిలయంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 5: షట్తిలా ఏకాదశి సందర్భంగా బుధవారం అంబేద్కర్ స్టేడియం వద్ద గల తిరుమలనగర్, రోడ్ నెంబర్-3లో శ్రీనిలయంలో శ్రీరామ సేవా తరంగిణి ట్రస్టు ఆధ్వర్యంలో మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్య స్వామి నేతృత్వంలో విశేష పూజలు జరుగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి శ్రీవిష్ణుసహస్ర నామస్తోత్ర పారాయణం, అష్టాక్షరీ మూల మంత్ర సహిత లక్ష్మీనారాయణ హోమం జరుగనున్నాయి. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని నిర్వాహకులు కోరారు.

● సంక్షిప్త సమాచారం..

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులను టిజిపిపి రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభా కర్ మంగళవారం ప్రారంభించారు.

● గన్నేరువరం: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని లయన్ భవన్‌లో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఇంటర్‌నేషనల్ లయన్స్‌క్లబ్ 320జి గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి ప్రారంభించారు.

● రామడుగు: కరీంనగర్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 12న నిర్వహించనున్న బహిరంగ సభకు పార్టీశ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విజ్ఞప్తి చేశారు.

●చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్‌కార్మికుడు గుర్రం వెంకటస్వామి గల్ఫ్‌లో మరణించగా ఆయన కుటుంబసభ్యులకు మాజీ ఎమ్మె ల్యే సుంకె రవిశంకర్ అక్కడి బీమా కంపెనీ నుంచి వచ్చిన రూ.15 లక్షల చెక్కును అందజేశారు.

● చొప్పదండి: ఉమ్మడి జిల్లా గౌడ సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో ఈ నెల 10న జరిగె ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని చొప్పదండి గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల గంగయ్యా గౌడ్ కోరారు.

●గంగాధర: కామన్ సర్వీస్ సెంటర్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం గంగాధర మండలం కురిక్యాల వ్యవసాయ సొసైటీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి న కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు.

● హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేటకు చెందిన అనపురం తిరుపతిగౌడ్‌ను జైగౌడ జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర అధికార ప్రతి నిధి పబ్బు భానుగౌడ్ మంగళవారం తెలిపారు.

- హుజూరాబాద్‌కు చెందిన తాళ్లపల్లి రమేష్‌ను తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరిగౌడ్ తెలిపారు.

● జమ్మికుంట రూరల్: పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) హుజూరాబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశాన్ని నియోజకవర్గ అధ్యక్షు లు వాసాల రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

● ఇల్లందకుంట : మండల కేంద్రంలోని 768 సర్వే నంబర్‌లోని భూమికి యాదవ కులస్థులకు ఎలాంటి సంబంధం లేదని, ఒకవేళ ఆధారాలు ఉంటే చూపించాలని అదే గ్రామానికి చెందిన రావుల ఎల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● హుజూరాబాద్: మార్చి 8న మహిళా దినోత్సవం సందర్భంగా మణిపూర్‌లో కుకీ ఆదివాసీ మహిళలపై జరిగిన అమానవీయ హత్యచారానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని తెలంగాణ రాష్ట్ర ఆదివాసి విప్లవ మహిళా సంఘం ఒక ప్రకటనలో తెలిపింది.

●సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి రైతు వేదికలో మంగళవారం వరి, మొక్కజొన్న పంటల ఎరు వుల యాజమాన్యం, వాటిలో వచ్చే వివిధ రకాల పురు గులు, తెగుళ్లపై రైతులకు కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీడీఏ, ఎస్‌టీసీ చత్రునాయక్, ఏవో వైదేహి, ఏఈవో రజితపాల్గొన్నారు.

● హుజూరాబాద్: పట్టణానికి చెందిన క్యాస సాయికృప జన్మదినం సందర్భంగా మంగళవారం దేవాలయాల్లో పనిచేసే స్వీపర్లను సన్మానించారు. వారిని శాలువాలతో సత్కరించి నగదును అందజేశారు.